పిల్లల్ని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



చిన్నతనం నుంచి పిల్లల్ని తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచితే వారిలో నేరప్రవృత్తికి అవకాశం ఉండదు. మగపిల్లల్ని, ఆడపిల్లల్ని వేర్వేరు దృక్పథంతో కాకుండా సమానంగా చూస్తేనే లైంగిక దాడుల సంస్కృతి తగ్గుతుంది. సెక్స్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడం కూడా బాలికలపై అత్యాచారాల నిరోధానికి తోడ్పడుతుంది. వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ తాళ్ళూరి రామకోటేశ్వరరావు, గైనకాలజిస్ట్, తిరువూరు



వైద్యులకు రక్షణ కల్పించాలి

నిత్యం ప్రజలతో మమేకమయ్యే వైద్యులపై అత్యాచారాలు, హత్యలు జరగడం శోచనీయం. వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలి. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతా వంటి ఘటనలు జరిగినపుడు దోషుల్ని కఠినంగా శిక్షిస్తే అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడవచ్చు. చట్టాలను పటిష్టంగా అమలు చేస్తేనే నేరాలు తగ్గే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గార్గేయ, తిరువూరు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి



క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

విస్సన్నపేట: మండలంలోని కలగర సబ్‌స్టేషన్ పరిధిలో అదనపు ఫీడరు మంజూరు కావటంతో నూతనంగా స్తంభాలు ఏర్పాటు చేశామని, విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల నిమిత్తం మంగళవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ విజయభాస్కర్ సోమవారం తెలిపారు. కలగర, లక్ష్మీపురం, రామచంద్రాపురం గ్రామాల్లో ఉదయం 9 మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుతు సరఫరా నిలిపివేస్తామని, గ్రామస్తులు సహకరించాలని ఏఈ కోరారు.

కార్పొరేట్లకు అనుకూలంగా చంద్రబాబు పాలన

నూజివీడు: రాష్ట్ర అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు ద్వారాలు తెరిచే విధంగా ప్రపంచ బ్యాంకు ముద్దుబిడ్డ, ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగనుందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా విభజిత ఆంధ్రప్రదేశ్‌కు, అమరావతి క్యాపిటల్‌కు కేటాయించిన నిధులు అప్పుల రూపంలో ఇచ్చారు తప్ప గ్రాంట్ గా ఇచ్చింది లేదని, చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే తప్పనిసరిగా ప్రపంచ బ్యాంకును ఆశ్రయించే దుస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఉపాధి, నిరుద్యోగం, పేదరికం, విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, భూమి హక్కులు లాంటి మౌలిక సమస్యలపై ఆందోళన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను తక్షణం అమలు చేసే విధంగా ఉద్యమించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు, మూడు సిలిండర్లు, 20 లక్షల ఉద్యోగాల కల్పన, రూ.3వేల నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను తక్షణం ఇవ్వాలని హరినాథ్ డిమాండ్ చేశారు.

ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా

మైలవరం: ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరంలో గత అర్ధరాత్రి ప్రధాన రహదారుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. బహిరంగంగా మద్యపానం నిషిద్ధమన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మైలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై గ్రామస్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు మండల పరిధిలోని చెవుటూరు, హెచ్.ముత్యాలంపాడు, పినపాక, కుంటముక్కల గ్రామాల్లో అధికారులు సోమవారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ఎంఈఓ పుష్పలత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరానికి గానూ చెవుటూరు గ్రామంలో ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.129.38 లక్షలు ఖర్చు చేయగా మెటీరియల్‌కు రూ.3 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. కుంటముక్కల గ్రామంలో వేతనాలకు రూ.105.50 లక్షలు, మెటీరియల్‌కు రూ.3.14 లక్షలు, పినపాక గ్రామంలో వేతనాలకు రూ.53.9 లక్షలు, మెటీరియల్‌కు రూ.94 వేలు, ముత్యాలంపాడు గ్రామంలో వేతనాలకు రూ.87.21 లక్షలు, మెటీరియల్‌కు 1.60 లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. ఈ ఆడిట్‌లో చిన్న చిన్న పొరపాట్లు మినహా ఎటువంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించలేదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కంచు గంటలు బహూకరణ

గోపవరం(ముసునూరు): గోపవరం శివారు నాగేంద్రపురంలోని సుప్రసిద్ధ, మహిమాన్విత ప్రత్యక్ష నాగేంద్రస్వామి ఆలయానికి భక్తులు కంచు గంటలను బహూకరించారు. ఏలూరు మండలం చాటపర్రుకు చెందిన గుత్తా శ్రీనివాసరావు, మాధవి దంపతులు రూ.73 వేల విలువైన మూడు కంచు గంటలను ఆలయ ధర్మకర్త నందిగం సుబ్బారావుకు సోమవారం అందజేశారు. ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ పల్లం చిట్టిబాబు ఆధ్వర్యంలో దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ, ప్రసాదాశీర్వచనాలు అందజేశారు.

గాదెవారిగూడెంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

గాదెవారిగూడెం(గంపలగూడెం): మండలంలోని గాదెవారిగూడెంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ఆరోగ్య సర్వే చేశారు. ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 11 నెలల బాలుడు నంద్యాల గీతంనాయుడు విషజ్వరం సోకి మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తిరువూరు సబ్ యూనిట్ అధికారి షేక్ బాబూవలి, ఊటుకూరు పీహెచ్‌సీ వైద్యుడు సురేష్ గ్రామంలో పర్యటించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు గ్రామంలో సర్వే చేసి ఎవరైనా జ్వరపీడితులు ఉన్నారా అని ఆరా తీశారు. పంచాయతీ సిబ్బందితో మురుగుకాల్వల వెంట బ్లీచింగ్ చల్లించి, ఎబెట్ ద్రావణం పిచికారీ చేయించారు. ప్రస్తుతం గ్రామంలో ఒక్కరు మాత్రమే జ్వరంతో ఉన్నారని బాబూవలి చెప్పారు. గ్రామస్తులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులతో టిఫిన్ల తయారీ

సోషల్ వెల్ఫేర్ జేడీ విచారణ



నూజివీడులోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా జేడీ జయప్రకాష్

నూజివీడు: పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సిబ్బంది ఆదివారం ఉదయం విద్యార్థులతో పూరీలు తయారు చేయించారు. ఈ ఘటనపై అధికారుల దృష్టికి సమాచారం అందడంతో సోమవారం సాంఘిక సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా జేడీ జయప్రకాష్ విచారణ నిర్వహించారు. వంట సిబ్బందిని, తొమ్మిదో తరగతి విద్యార్థులను దీనిపై విచారించారు. వంటశాలను, తయారు చేసిన కూరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు విచారణ నిర్వహించానని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని చెప్పారు.

గురుకుల పాఠశాలల డీసీఓ విచారణ

బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల ఏలూరు జిల్లా డీసీఓ ఎన్.భారతి పిల్లలతో పూరీలు తయారు చేయిస్తున్నారన్న విషయమై సోమవారం విచారణ నిర్వహించారు. అనంతరం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ పాఠశాలలో 677 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి ప్రతి ఆదివారం ఉదయం మెనూ ప్రకారం అల్పాహారంగా పూరీలు పెడతామని చెప్పారు. చిన్న పిల్లలు రెండు చొప్పున, పెద్ద పిల్లలు మూడు చొప్పున పూరీలు వేయించుకుంటారని తెలిపారు. అంతమందికి కలిపి దాదాపు 1500 పూరీలు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఏడుగురు వంట పనివారు ఉన్నారని, వారిలో ఇద్దరు ఊడ్చడం, కడగడం వంటి పనులు చేస్తారని చెప్పారు. మిగిలినవారు వంట పని చేస్తారన్నారు. ఐదుగురితో అన్ని వందల పూరీలు చేయడమంటే చాలా ఆలస్యమవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం 1996లోనే సొసైటీస్ స్టాండింగ్ ఆర్డర్ ఇచ్చిందని, దాని ప్రకారం పూరీలు చేయడంలో 20 మంది విద్యార్థుల సహాయం తీసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొందని చెప్పారు. వేకువజామున ఐదు గంటల తరువాత నుంచి మాత్రమే విద్యార్థుల్లో కొందరు పూరీ ముద్దలు చేయడం, మరి కొందరు పూరీలు వత్తడం చేస్తుంటారన్నారు. ఎవరినీ ఒత్తిడి చేయడం, బలవంతం చేసి పనికి పిలవడం జరగడం లేదని చెప్పారు. విచారణలో ప్రిన్సిపాల్ ఆర్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వయోజన విద్యతో వృద్ధుల జీవితాలకు వెలుగు

గంగినేని(జికొండూరు): వయోజన విద్యతో వృద్ధులు, శ్రామికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని గ్లోబల్ గాస్పెల్ రీచ్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ అబ్రహాం అన్నారు. చర్చి ఆధ్వర్యంలో గంగినేని గ్రామంలో చదువురాని వృద్ధులకు వయోజన విద్య కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురికి స్టడీ మెటీరియల్ అందజేసి అక్షరాభ్యాసం చేయించారు. కూలీనాలీ చేసుకునే వారు పేదరికం నుంచి బయటపడాలంటే చదువు తప్పనిసరిగా ఉండాలన్నారు. కనీసం సంతకం చేసేంతవరకైనా చదువుకోవాలన్నారు. రాయడం, చదవడం వస్తే కుటుంబానికి అవసరమైన ఆర్థిక, సామాజిక, మానసిక స్థైర్యం సంపాదించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.

చప్టా కూలి నిలిచిన రాకపోకలు



గంగినేని, కొత్తపాలెం గ్రామాల నడుమ కూలిన చప్టా

జి.కొండూరు: ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న గంగినేని, కొత్తపాలెం గ్రామాల మధ్య ఎన్ఎస్‌పీ కాల్వపై ఉన్న చప్టా సోమవారం రాత్రి కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ చప్టా శిథిలావస్థకు చేరడంతో పాటు నిత్యం ఈ చప్టా మీదుగా రైల్వేలైను ఏర్పాటుకు వినియోగించే మెటల్ కంకర లోడుతో భారీ నుంచి అతి భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వలనే ఇది కూలినట్లు భావిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు నుంచి గడ్డమణుగు, చెర్వుమాధవరం, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాలను కలుపుతూ తెలంగాణ రాష్ట్రంలోని కొత్తపాలెం మీదుగా ఎర్రుపాలెం, మధిర, ఖమ్మం వరకు వెళ్లేందుకు ఈ రహదారి ప్రధాన మార్గంగా ఉంది. ఈ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసే వరకు రోజువారీ అవసరాలతో పాటు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలుగా సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా రహదారి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు జేవీవీ కృషి

ఇబ్రహీంపట్నం(మైలవరం): ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని జేవీవీ కొండపల్లి పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు తెలిపారు. జన విజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ వార్షిక సమావేశం స్థానిక క్రాంతి హైస్కూల్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారామారావు మాట్లాడుతూ 36 సంవత్సరాల నుంచి సామాన్య ప్రజల్లో శాస్త్ర విజ్ఞానం ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వి. మురళీమోహన్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ద్వారా మూఢ విశ్వాసాలు, ఛాందస భావాలను అరికట్టేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమగ్రమైన శాస్త్రీయ అవగాహన పెంపొందించడం, పరిష్కారాలు అన్వేషించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1న కొండపల్లి క్రాంతి హైస్కూల్‌లో జరిగే ఎన్టీఆర్ జిల్లా జన విజ్ఞాన వేదిక 18వ వార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. జేవీవీ కొండపల్లి ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సర్దార్ సాహెబ్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశంలో అధ్యక్షుడు ఎస్.నాగరాజు, సభ్యులు మస్తాన్ వలి, యలమందయ్య, నాగరాజు, డేవిడ్ రాజు, మురళి, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

నూజివీడు: పంట సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి అన్నారు. మండలంలోని బత్తులవారిగూడెంలో సోమవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆమె పలు సూచనలు, సలహాలు అందజేశారు. సహజసిద్ధ వనరులతో సాగు చేయడం, సేంద్రియ, జీవన ఎరువులను ఉపయోగించడం, ఎర పంటలు, లింగాకర్షక ఎరలను వాడి పురుగుల ఉనికిని గుర్తించి సస్యరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. నారు చివర్లు తుంచి నాటడం, నాటు వేసిన పొలంలో సరైన మోతాదులో ఎరువుల వాడకంపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో వీఏఏ పి.వెంకటేశ్వరరావు, ఐసీఆర్‌పీ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు ముసునూరి రాజా, పూర్ణా, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత



తిరువూరు బస్టాండులో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, సిబ్బంది

తిరువూరు: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల నియంత్రణకు ఎవరికి వారే జాగ్రత్త వహించాలని తిరువూరు ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్ సూచించారు. సోమవారం రైడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తిరువూరు ఆర్టీసీ బస్టాండు వద్ద ఎయిడ్స్, హెచ్ఐవీ, సుఖవ్యాధుల వ్యాప్తి, నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిచయం లేని వ్యక్తులతో శారీరక సంబంధాలు కలిగివున్న వారికి ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదని, ఇందుకు చికిత్స కూడా లభ్యమవుతోందని తెలిపారు. కండోమ్ వినియోగం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు లభ్యమయ్యే మందులు, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా అందే సేవలను రైడ్స్ ప్రాజెక్టు మేనేజరు ఎం.లక్ష్మి వివరించారు. సామాజిక కార్యకర్తలు కమల, సోమరాజు పాల్గొన్నారు.

యూపీఎస్ సాధించడంపై రైల్వే ఉద్యోగుల హర్షం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగులకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్) అమలు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవ సభలో డెప్యూటీ డివిజనల్ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ.. ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పోరాట పటిమతో యూపీఎస్ అమలు సాధ్యమైందన్నారు. యూపీఎస్ సాధనకు 2004 నుంచి 2024 వరకు ఎన్నో పోరాటాలు, రిలే నిరాహార దీక్షలు, సభలు, సమావేశాలను ఎంప్లాయీస్ సంఘ్ నిర్వహించి, సాధించిందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు యూపీఎస్‌తో ఆర్థిక సామాజిక భద్రత కలుగుతుందని చెప్పారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు శివ నాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి వినీత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి

మైలవరం: మానవ సేవే మాధవ సేవ అన్న లక్ష్యంతో స్వదేశాన్ని విడిచిపెట్టి భారతదేశంలో వ్యాధిగ్రస్తులు, నిరుపేదలకు ఎంతో సేవ చేసిన మదర్ థెరిస్సా సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మైలవరంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వంగూరు రమేష్, ట్రస్టు సభ్యులు మల్లెల అనిల్, కాసుల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలనులో...

పెనుగొలను(గంపలగూడెం): మదర్ థెరిస్సా జయంతిని పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ ఆమె చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు.

ప్రాంగణ ఎంపికలో 50 మందికి ఉద్యోగాలు

నూజివీడు: పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 50 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్‌వీఎం వర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికకు పీజీ, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ విద్యార్థులు పాల్గొనగా వీరికి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ప్రాంగణ ఎంపికకు 120 మంది హాజరవగా వారిలో 50 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దివీస్ లేబొరేటరీస్ సంస్థ హెచ్ఆర్ కావూరి రామకృష్ణ, రసాయనశాస్త్ర విభాగ కోఆర్డినేటర్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనాలి



ఇబ్రహీంపట్నం(మైలవరం): యువత తమ వంతుగా కొంత సమాజ సేవ చేయాలని క్రాంతి హైస్కూల్ సర్వీస్ క్లబ్ ఇన్‌చార్జి యాస్మిన్ తెలిపారు. కొండపల్లి క్రాంతి హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థినులు సోమవారం స్వయంగా మధ్యాహ్న భోజనం తయారు చేసి ఫెర్రీలోని సహాయ మాత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా ప్రేమతో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భోజనం తినిపించారు. ఆరు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు నెలకు ఒక సెక్షన్ చొప్పున వివిధ ప్రదేశాలలో మార్చి నెల వరకు ఈ సర్వీస్ చేస్తారని తెలిపారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా



ఇబ్రహీంపట్నంలో కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులతో కలసి ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

నూజివీడు: పట్టణంలోని పలు పాఠశాలల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. త్రివిధ హైస్కూల్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణను రంగురంగుల ముగ్గులు, కాగితాలుతో, మామిడి తోరణాలతో అలంకరించారు. చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. కృష్ణాష్టమి విశిష్టత, కృష్ణుడి లీలలు, కృష్ణుడి వైభవాన్ని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ వివరించారు.

నారాయణ స్కూల్‌లో...

పట్టణంలోని నారాయణ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట సింహాద్రి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి మండలంలో...

చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి పండుగను ప్రజలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగొలనుపేటలో యువకులు ఉట్టి కొట్టే పండుగ వేడుకగా నిర్వహించారు.

ముసునూరు మండలంలో...

ముసునూరు: భక్తులు ముకుంద, మాధవ, గోవింద నామ స్మరణ, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్‌లు, బాలల కోలాటాల సందడి నడుమ సంప్రదాయ రీతిలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోపూడిలోని ప్రసిద్ధ వేణుగోపాల స్వామి ఆలయం, ముసునూరు, వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లి, బాసవరప్పాడు, గుడిపాడు, తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద సోమవారం ఉత్సవాలు నిర్వహించి, యువత ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు.

గీతాబోధనలు సమాజానికి ఆదర్శం

ఇబ్రహీంపట్నం: శ్రీకృష్ణుడి గీతాబోధనలు నేటి సమాజానికి ఆదర్శ మార్గమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవుడు తన జీవితంలో ఎదుర్కొనే ప్రతి సంఘటనకు శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా ధర్మ మార్గం చూపించాడన్నారు. జ్ఞానం, మోక్షం, బ్రహ్మం, ఆధ్యాత్మికం గురించి అద్భుతంగా వివరించాడని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ, గోపికల వేషధారణలో అలరించారు. సంప్రదాయబద్ధంగా కోలాటం నిర్వహించారు. ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు.

కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కొలుసు, ఎంపీ పుట్టా

నూజివీడు: మండలంలోని కొత్త రావిచర్లలో సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి, ఎంపీలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి కాపా శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో కృష్ణాష్టమి వేడుకలు

విస్సన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ద్వారకానగర్, జానలగడ్డ గ్రామాల్లో ఉన్న కృష్ణుడి దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్రేలలో, తాతకుంట్ల యాదవుల వీధిలో ఊరేగింపులు ఘనంగా నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పలుచోట్ల ఉట్టి ఏర్పాటు చేసి యువకులు ఉట్టిని ఉత్సాహంగా కొట్టారు.



మైలవరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నివృతరావు, జాస్తి వెంకటేశ్వరరావు, శ్రీధర్ తదితరులు

ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి: మండలంలో ఆగిరిపల్లి, నెక్కలం గొల్లగూడెం, వట్టిగుడిపాడు, వడ్లమాను గ్రామాల్లో సోమవారం వైభవంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆగిరిపల్లిలోని వరహాపుష్కరిణి వద్ద గల శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, విశేషాలంకరణ, స్వామి వారి కల్యాణం నిర్వహించారు. వేణుగోపాల స్వామిని మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ కృష్ణ యువసేన ఆధ్వర్యంలో కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమం, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

మైలవరం: ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం వారిచే సోమవారం విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. మండలంలోని 20 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ గవర్నర్ లయన్ వీవీఎస్ ఆంజనేయులు, లయన్స్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎస్వీ నివృతరావు, జోన్ చైర్‌పర్సన్ లయన్ జాస్తి వెంకటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా శంకరాచారి, లీలా రాధిక, రత్నకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి ప్రసాద్, బాలాజీ ప్రసాద్, దేవస్థానం సిబ్బంది, టీచర్స్, పేరెంట్స్, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రపంచానికే ఆదర్శనీయం

మైలవరం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మైలవరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాల్లో శ్రీకృష్ణుని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పాఠశాల విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

జ్వరాలు అదుపులో ఉన్నాయి

డాక్టర్ సునీల్


చంద్రాల(మైలవరం): జ్వరాలు అదుపులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం మండలంలో గత నెల 29 నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 16 ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యపరీక్షలు చేశామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. జ్వరాలు గత నెలలో కన్నా ఈ వారంలో తగ్గుముఖం పట్టాయని వివరించారు.

సవరణ

[illegible]

T.V.N. బాబురావు [illegible]

వంద మంది వృద్ధులకు వస్త్రాల పంపిణీ



వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ దేవినేని కిషోర్‌కుమార్, జోనీ కుమారి సమాజానికి చేస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. దేవినేని కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవినేని దంపతులు వంద మంది వృద్ధులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. సామాజిక సేవ చేస్తున్న దేవినేని కిషోర్‌కుమార్ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.